సూర్యాపేట నియోజకవర్గం

ప్రజల మాట ప్రగతి బాట

3

నమస్తే తెలంగాణ
బుధవారం 25 అక్టోబర్ 2023

ntnews.com

# అభివృద్ధే మా ఆయుధం

- చెడుపై మంచి గెలుపే విజయదశమి
- విపక్షాల కుట్రలను ఛేదించి సీఎం కేసీఆర్ గెలిచి నిలిచాడు
- పోరాడి సాధించిన తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపాడు
- పదేండ్లలోనే వందేండ్ల అభివృద్ధి చేసిండు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- దసరా వేడుకల్లో పాల్గొన్న మంత్రి దంపతులు



సూర్యాపేటటౌన్ : ప్రచార రథానికి పూజలు చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 24 : చెడుపై మంచి గెలుపే విజయదశమి అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం విజయదశమిని పురస్కరించుకుని సూర్యాపేటలోని జమ్మిగడ్డలో నిర్వహించిన వేడుకల్లో అలాగే మంగళవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన దసరా వేడుకలో మంత్రి కుటుంబ సమేతంగా పాల్గొని జమ్మి పూజలు నిర్వహించి ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెడుపై మంచిని బతికించాలనే సంకల్పంతో పాండవులు జమ్మిచెట్టు వద్ద ఆయుధ పూజలు చేసి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. అదే మాదిరిగా 14 ఏండ్లు ఉద్యమం చేసి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిరంతర అభివృద్ధి పాలనే ఏకైక ఆయుధంగా భావించి ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అన్నారు. 60 ఏండ్లకు పైగా పాలించిన ఉమ్మడి పాలకుల హయాంలో అన్ని విదాలుగా ఆగమైన తెలంగాణ ప్రాంతాన్ని అతి తక్కువ సమయంలో అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతున్నదన్నారు. ఆసరా పింఛన్లు, రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, బీసీ బంధు, నిరంతర విద్యుత్, తాగు సాగు, సాగునీరు ఇలా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని నేడు యావత్ దేశం నమ్ముతున్నదన్నారు. ఉమ్మడి పాలకుల హయాంలో సూర్యాపేటలో జరిగిన పండుగ వేడుకలు, గత పదేండ్లుగా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్న వేడుకలకు తేడాను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతో రాబోయే రోజుల్లోనూ ఇటువంటి ప్రశాంత వాతావరణంలో మరింత అభివృద్ధి సాధించుకుందామన్నారు.

## మంత్రి నివాసంలో ప్రత్యేక పూజలు..

విజయ దశమి పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పట్టణ ప్రముఖ పురోహితులు మంత్రి, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందించారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు. అలాగే జిల్లా కేంద్రంలోని కనకదుర్గమ్మ దేవాలయంలో నిర్వహించిన హోమంలో మంత్రి పాల్గొన్నారు.

## శుభాకాంక్షల వెల్లువ..

మంత్రి జగదీశ్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సూర్యాపేటకు తరలివచ్చి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రత్యేక పర్యటనకు వచ్చిన కొరియా బృందం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శభాకాంక్షలు తెలిపారు.

## సామూహిక విందు..

విజయ దశమి పర్వదినం సందర్భంగా తన నివాసంలో మంత్రి జగదీశ్‌రెడ్డి సర్వ మతాల వారికి సామూహిక విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా మత పెద్దలు మంత్రిని ఆశీర్వదించి విజయం వరించాల్సిందిగా కోరారు. కార్యక్రమాల్లో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఉప్పల లలితా ఆనంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, వై.వెంకటేశ్వర్లు, గండూరి ప్రకాశ్, ఉప్పల ఆనంద్, సవరాల సత్యనారాయణ, బూర బాల సైదులు, మొరిశెట్టి శ్రీను, గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, గుణగంటి రాములు, పెండెం చంద్రశేఖర్, డాక్టర్ రామ్మూర్తియాదవ్, గుర్రం సత్యనారాయణరెడ్డి, బొబ్బ హర్షారెడ్డి, తిప్పని సుధీర్‌రెడ్డి, తాహేర్ పాషా, పూర్ణ శశికాంత్, కీసర వేణు గోపాల్‌రెడ్డి, ముదిరెడ్డి అనీల్‌రెడ్డి, ఎలక హరీశ్, కౌశిక్ పాల్గొన్నారు.

బొడ్రాయిబజార్ : జిల్లా కేంద్రంలో ప్రజలు విజయదశమిని ఘనంగా జరుపుకున్నారు. వేంకటేశ్వరస్వామి, సంతోషిమాత, వేదాంత భజన మందిరం, అయ్యప్పస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జమ్మిగడ్డలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శమి వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సంతోషిమాత దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కైలాస శంకరులను దర్శనం చేసుకున్నారు. అవాంఛనీయమైన ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, మారిపెద్ది శ్రీనివాస్ ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నూకా వెంకటేశం, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, పబ్బా ప్రకాశ్, గోపారపు రాజు, ఉప్పల రమేశ్, బొనగిరి విజయ్‌కుమార్, దేవరశెట్టి సోమయ్య, బ్రాహ్మనపల్లి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : మండల వ్యాప్తంగా ప్రజలు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

చివ్వెంల : మండల వ్యాప్తంగా దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎంపీపీ ధరావత్ కుమారీబాబూనాయక్, జడ్పీటీసీ భూక్యా సంజీవ్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగ జరుపుకోవడం సంతోసకరమని జడ్పీటీసీ మామిడి అనితాఅంజయ్య అన్నారు. అనంతారంలో శమీ పూజలో పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సీతారామాంజనేయ ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు.
ఎంపీటీసీ మామిడి రేవతి, ఉప సర్పంచ్ మామిడి మైసయ్య, దంతాల వెంకటేశ్వర్లు, మస్తాన్ పాల్గొన్నారు.



సూర్యాపేటటౌన్ : మంత్రి నివాసంలో సామూహిక భోజనాలు



సూర్యాపేటటౌన్ : పాలపిట్టతో భక్తులు



బొడ్రాయిబజార్ : పాలపిట్టతో సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ కుటుంబ సభ్యులు




ఆత్మకూర్.ఎస్ : నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం వద్ద వాహనాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చివ్వెంల : ఉండ్రుగొండలో ఆయుధ పూజలో పాల్గొన్న గ్రామస్తులు



సూర్యాపేటటౌన్ : మండల పరిషత్ కార్యాలయం వద్ద దసరా వేడుకలో పాల్గొన్న పట్టణవాసులు

# వైస్ ఎంపీపీపై బీరు సీసాతో దాడి

- దసరా వేడుకల్లో ఘటన
- కాంగ్రెస్ నాయకుల అనుచరులేనని బాధితుడు శ్రీనివాస్‌నాయుడు పోలీసులకు ఫిర్యాదు

సూర్యాపేట, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట మండలం బాలెంల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌నాయుడుపై సోమవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారు. బీరు సీసాతో తలపై మోదడంతో గాయాలయ్యాయి. ఆ సమయంలో నాయుడు అనుచరుడు ఒకరు గుర్తించి చేయి అడ్డు పెట్టడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఇటీవల ఓ ఎలక్ట్రానిక్ మీడియా చానల్ వారు నిర్వహించిన చర్చా వేదికలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పచ్చి బూతులు తిట్టుకున్నారు. అక్కడనే తాను లోకల్.. బయటి నుంచి ఇక్కడ రాజకీయం ఎంట్రా.. ఎవర్నీ వదలా.. ఒక్కొక్కడి అంతు తేలుస్తా అంటూ రెచ్చిపోయిన నాయకుడి అనుచరులే వైస్ ఎంపీపీపై దాడికి పాల్పడ్డట్లు స్థానికులు, బీఆర్ఎస్ శ్రేణులు తెలుపుతున్నాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో దసరా వేడుకల సందర్భంగా తన అభిమానులతో కలిసి పూజలు చేసే ప్రదేశంలో నిలబడి ఉండగా వెనుక నుంచి ఓ వ్యక్తి ఒక్కసారిగా బీరు సీసాతో తలపై దాడి చేసినట్లు చెప్పాడు. పక్కనే ఉన్న వ్యక్తి దాడిని గుర్తించి చేయి అడ్డుపెట్టగా స్వల్ప గాయాలతో బయటపడ్డట్లు తెలిపాడు. పగిలిన సీసా పెంకుతో మరోమారు దాడికి పాల్పడబోగా పక్కకు నెట్టి అక్కడి నుంచి వెళ్లినట్లు వివరించారు. అనంతరం కొంత దూరం వెళ్లిన తర్వాత చేయి అడ్డుపెట్టిన వ్యక్తిని పట్టుకుని మళ్లీ దాడికి పాల్పడ్డారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిని, పురిగొల్పిన వారిని గుర్తించి శిక్షించాలని కోరారు. ఈ విషయమై సూర్యాపేట రూరల్ సీఐ అశోక్‌రెడ్డిని వివరణ కోరగా బాలెంల దాడి ఘటనపై ఫిర్యాదు అందిందని, విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.